తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## స్పందనకు 383 అర్జీలు



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై ప్రజలు 383 అర్జీలు ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులుకు సమర్పించారు. కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించిన ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 298 సమస్యలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ డిఆర్‌ఓ శివయ్య, ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో సంజీవ్‌గోయెంకా

తిరుమల, డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో పారిశ్రామిక వేత్త సంజీవ్‌గోయెంకా కుటుంబంతోకలసి దర్శనం చేసుకున్నారు. వీరితో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. అనంతరం టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలుఅందజేశారు.

## వెంకన్న ఆలయంలో
# వైకుంఠ ఏకాదశికి కొండ ముస్తాబు
### -ఆలయం పరిసరాలు గ్రిల్స్‌శుభ్రం



తిరుమల, డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది కూడా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధనుర్మాసంలో ఏకాదశిఘడియలు వైకుంఠ ఏకాదశిగా వైష్ణవాలయాలలో అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈఏడాది డిసెంబర్ 23వతేదీ శనివారం వైకుంఠ ఏకాదశి, 24న ఆదివారం వైకుంఠ ద్వాదశి ఘడియలతో బాటు అదనంగా మరో ఎనిమిదిరోజులు పవిత్రమైన మోక్షమార్గం "వైకుంఠద్వారం"తెరచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఇందుకోసం తిరుమలకొండను ముస్తాబుచేస్తున్నారు. ఆలయం పరిసరాల్లో ,ముందుభాగంలో మహద్వారం గ్రిల్స్‌ను ఆయుర్వేద పొడితో శుభ్రం చేస్తున్నారు. ఇందుకోసం కార్మికులు వారికి అప్పగించిన పనుల్లో నిమగ్నమయ్యారు. ఆలయం ముందుభాగంలో రంగవల్లులు కూడా తీర్చిదిద్దే పనులు మొదలుకానున్నాయి. ఈ ఏడాది టిక్కెట్,టోకెన్ ఉన్నభక్తులను వైకుంఠద్వారదర్శనాలకు ఆలయంలోపలకు అనుమతించనున్నారు.

# లా నేస్తం ఆర్థిక లబ్ధి సద్వినియోగం
### - జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
జూనియర్ న్యాయవాదులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్‌ఆర్ లా నేస్తం కింద విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. వెలగపూడి సిఎం క్యాంపు కార్యాలయం నుండి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం 2023 సంవత్సరంలో రెండవ విడత జూనియర్ న్యాయవాదులకు వైఎస్‌ఆర్ లా నేస్తం విధులను వర్చువల్ విధానంలో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ కార్యక్రమంకు కల్టెరేట్ నుండి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఐసిడిఎస్ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధమ్మ, బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి తదితరులు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో వెలగపూడి నుండి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొన్న విద్యార్థులకు నెలకు 5 వేల రూపాయలు చొప్పున మూడేళ్ళకు 1.80 లక్షల రూపాయలు ఒకొక్క లబ్దిదారుడికి వైఎస్‌ఆర్ లా నేస్తం పథకం కింద అందించడం జరుగుతుందన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొన్న జూనియర్ న్యాయవాదులకు వారి వృత్తిలో నిలదొక్కుకోవడానికి మూడేళ్ళ పాటు ప్రోత్సాహకంగా ప్రతి నెల 5 వేల రూపాయలు చొప్పున సంవత్సరానికి 60 వేల రూపాయలు, మూడేళ్ళకు 1.80 లక్షల రూపాయలు వైఎస్‌ఆర్ లా నేస్తం పథకం కింద సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి లబ్దిదారుల ఖాతాలో 30 వేల రూపాయలను జమ చేస్తున్నారన్నారు.



సిఎం వైఎస్ జగన్ నిర్వహించిన వైఎస్‌ఆర్ లా నేస్తం పథక కార్యక్రమానికి వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుండి హాజరైన జడ్పీ ఛైర్మన్, ఇన్‌ఛార్జీ కలెక్టర్.

ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్‌ఆర్ లా నేస్తం కింద జిల్లాలో జూన్ 2023 నాటికి 97 మంది స్టైఫండ్ అందుకొంటున్నారని, రెండవ విడతగా నవంబర్ 2023కు కొత్తగా 57 మందికి మంజూరు అయ్యిందన్నారు. జిల్లాలో మొత్తం 154 మంది లబ్దిదారులకు వైఎస్‌ఆర్ లా నేస్తం కింద 7.70 లక్షల రూపాయలు చొప్పున ఆరు నెలలకు ఒకసారి నగదును అర్హుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు.

### 'లా' నేస్తం సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



తిరుపతిరూరల్, డిసెంబర్10 ప్రభాతవార్త:
'లా' నేస్తానికి అర్హులైన జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత వైయస్సార్ లా నేస్తాన్ని లబ్ధిదారులకు తాడేపల్లి సి.యం. క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని నిర్వహించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైయస్సార్ లా నేస్తం కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ లాయర్లకు వృత్తిలో నిలదొక్కుకునే మూడేళ్ళ పాటు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.60వేల రుపాయాలు వంతున అందిస్తున్న విషయం తెల్సిందే. సోమవారం ఆరు నెలలకు సంబంధించి రూ.30 వేల రుపాయాలను ఖాతాల్లో జమ చేసారు. జిల్లాలోని లబ్ధిదారులకు రూ.50లక్షల 30 వేలు రుపాయాలు మంజూరైందని, మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేసారు. 2023 జూలైలో 171 మంది జూనియర్ లాయర్లకు, ఆగష్టు 170చ సెప్టెంబర్-170, అక్టోబర్-173, నవంబర్-166, డిసెంబర్-156 మందికి ఒక్కొక్కరికి నెలకు రూ.5వేల రుపాయాలు చొప్పున ఆరు నెలలు పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

## కాణిపాకంలో కార్తీక దీపారాధన



మణికంఠేశ్వరాలయంలో ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కాణిపాకం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం చివరి సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పుంగనూరు కోనేరులో కార్తీక దీపోత్సవం

పుంగనూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త :



చారిత్రక పుంగనూరు పుష్కరిణి కార్తీకమాసం చివరి సోమవారం రాత్రి వేలాదిమంది ప్రజలు వెలిగించిన కార్తీకదీపాలతో అత్యంత సుందర ంగా వైభవాన్ని ప్రదర్శించింది. ఎపుడో వందలాది ఏళ్ల క్రితం ఇక్కడి ప్రజల కోసం పాలకులు నిర్మించిన శ్రీఅన్నపూర్ణాసమేత శ్రీకాశీవిశ్వేశ్వరాలయం ఎదురుగా నిర్మాణ మైన ఈ అపురూమైన కోనేరు కార్తీక దీపాలతో వర్ధిల్లి,రాబోయే అద్భుతమైన ఆధ్యాతి ్మకమాసం,మాసానాం మార్గశీర్శోహం అని వినుతికెక్కిన మార్గశిరమాసానికి స్వాగతం పలుకుతున్నట్లుగా అగుపించింది. పవిత్రమైన కార్తీకమాసంలో ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే, ఈపుష్కరిణిదీపోత్సవం చూడడానికి రెండు కళ్లుచాలవు. వేలాది మందిప్రజలు తండోపతండాలుగా పాల్గొని దీపాలు వెలిగించి ధన్యులయ్యారు.

## పంటపొలాలపై
# ఏనుగుల దాడులు

కృష్ణాపురం వద్ద వస్తున్న ఏనుగుల గుంపు



వి.కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
వి.కోట మండలంలో గత రెండు రోజులుగా ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తోం ది. ఆదివారం రాత్రి తోటకనమ బీట్ కొమ్మరిమడుగు గ్రామ పొలా ల్లోకి 13 ఏనుగులు ప్రవేశిం చాయి. రైతులు సాగు చేస్తున్న కాకర, స్వీట్ కార్న్ పంటలను ధ్వంసం చేశాయి. రైతులు ఏనుగులను తరమడంతో వెంకటపల్లి, కృష్ణాపురం, నెర్నిపల్లి, కోట నక్కనపల్లి గ్రామాల మీదుగా వచ్చిన ఏనుగులు పంటలను ధ ్వంసం చేశాయి. సోమవారం జవునిపల్లి క్రాస్ వద్ద ఏనుగులు కృష్ణాపురం వైపు మళ్లాయి. హంద్రీ-నీవా కాలువ వెంబడి మోట్లపల్లి, తెట్టు, మర్రిమాకులపల్లి, కుంబార్లపల్లి, ముమ్మిడేర్లపల్లి, తిమ్మరాజపురం మీదుగా వచ్చి గిడుగు అటవీ ప్రాంతంలో వెళ్లాయి. అయితే మరలా ఏనుగులు ఏక్షణాన దాడులు చేస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# రౌడీ షీటర్ హత్య



తిరుపతి క్రైం, డిసెంబర్ 11, ప్రభాతవార్త
తిరుపతి నగరంలో రౌడీ షీటర్‌ని కొంత మంది దారుణంగా హత్య చేసారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరోజ్ అనే యువకుడు ఓ యువతిని అల్లరి పట్టిస్తున్నాడని సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన భూపాల్ కుమారుడు కిషోర్ (30) మందలించాడు. కిషోర్ పై కోపం పెంచుకున్న ఫిరోజ్ తన స్నేహితులు లోకేష్ దేవేంద్రకు చెప్పాడు. ఆదివారం రాత్రి కిషోర్ తన ఇంటి వద్ద ఉన్న బ్రిడ్జి పైన కూర్చొని ఉన్నాడు. లోకేష్ కిషోర్‌ని ఫిరోజ్‌తో ఎందుకు గొడవ పడుతున్నావ్, అతని జోలికొస్తే నిన్ను కొట్టాల్సి వస్తుందని బెదిరించడంతో కిషోర్ లోకేష్‌తో గొడవ పడ్డాడు. లోకేష్ అక్కడి నుంచి వెళ్లి తన స్నేహితులను తీసుకువచ్చి కత్తులతో కిషోర్ పై దాడి చేసి పరారయ్యారు. రక్తపు మడుగుల పడి ఉన్న కిషో ర్‌ని తన కుటుంబ సభ్యులు మరో యువకుడు సహాయంతో సమీపంలో ఉన్న శ్రీ హాస్పిటల్‌కి తీసుకెళ్లా రు. అక్కడ బాధితుడు పరిస్థితి బాగా లేకపోవడంతో . అక్కడ వైద్యులు పెద్ద హాస్పిటల్‌కి తీసుకెళ్ళమని చెప్పడంతో మంగళం రోడ్‌లో ఉన్న మెడిగో హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. అప్పటికే రక్తం అధికంగా కావడంతో వైద్యులు పెద్ద హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలని కుటుంబసభ్యులకు తెలిపారు. అక్కడి నుంచి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే యువకుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తమ స్వగృహానికి తరలించారు.

### - మృతుడు శవ పరీక్షకు పోలీసులు ఇక్కట్లు

హత్య జరిగినట్లు ఈస్ట్ పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు ఆరా తీసారు. కిషోర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్విమ్స్ హాస్పిటల్ దగ్గర నుంచి కెవి పురం అగ్రహారం బలిజపల్లికి తరలించినట్లు తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకుని మృతదేహానికి శవ పరీక్ష చేసి కేసు నమోదు చేయాలని తెలిపారు. అయితే కుటుంబ సభ్యులు శవపరీక్షకు అంగీకరించకుండా పోలీసులు ఇబ్బంది పెట్టారు. అంత్యక్రియలకు మృతదేహాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లారు. దీనితో ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులతో గ్రామ పెద్దలతో మాట్లాడి మృతదేహాన్ని రుయా హాస్పిటల్ తరలించి శవ పరీక్షలు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరి ప్రమీల ఫిర్యాదుతో లోకేష్ దేవేంద్ర చరణ్ రాహుల్, జనార్ధన్ శివపై కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు.

## కుప్పం సరిహద్దుల్లో
# ఏనుగుల జాడపై అప్రమత్తం
### జిల్లా అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి

కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలో తమిళనాడు నుంచి ఏనుగులు ప్రవేశించకుండా గట్టి చర్యలు చేపట్టినట్లు జిల్లా అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. తమిళనాడు నుంచి కుప్పంవైపు ఏనుగులు వస్తున్నాయనే సమాచారం ఫేక్ అన్నారు. గత వారం రోజుల క్రితం తమిళనాడులోని హొసూరు నుంచి కర్ణాటకలోని బన్నేరుఘట్ట అటవీ ప్రాంతంకు ఏనుగులు వెళ్తుండగా ఆ దృశ్యాలు చిత్రీకరించిన వారు ఏనుగులు కుప్పం వైపు వస్తున్నాయనే ప్రచారం చేస్తున్నారన్నారు. కుప్ప వైపు ప్రస్తుతం ఏనుగులు రాలేదని పేర్కొన్నారు. ఈ విషయంగా హొసూరు, కృష్ణగిరి జిల్లాల అటవీ అధికారులతో తాను చర్చించానన్నారు. అలాగే ఏనుగులు కుప్పం అటవీ ప్రాంతంలో ప్రవేశించకుండా అటవీ అధికారులు, సిబ్బంది, ట్రాకర్లతో సరిహద్దు అటవీ ప్రాంతంలో ఏనుగుల జాడను పసిగట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామన్నారు.

# నేడు కోటి బిల్వార్చనలు నిమజ్జనం: నదీ హారతులు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమాలకు సోమవారం ఆలయ కార్యనిర్వహణాధదికారి కె.యస్.రామారావు,ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పలు అంశాలకు సంబంధించి సమీక్షించారు.ఈ నేపథ్యంలో నిర్వహించే పూజా కార్యక్రమాల సమయాలను నిర్ణయించి సమయపాలనతో ఆచరించాలని ఆదేశించారు.ఈ మేరకు ఉదయం 5 నుంచి 6గంటల వరకు మొదటి కాలాభిషేకం, ఉదయం 6.30గంటలకు మొదటి కాల నైవేద్యం, ఉదయం 6.30 నుంచి 7.30గంటల వరకు రెండవ కాలాభిషేకం,7.30 నుంచి 8గంటల వరకు రెండవ కాల నైవేద్యం, ఉదయం 8 నుంచి 9గంటలకు పరివార దేవతలకు నైవేద్యం ఉదదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మూడవ కాల సహస్రశంఖాభిషేకం మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు తిరుప్పావడ (కుంభం) మధ్యాహ్నం 1 నుంచి 2గంటల లోపు కోటి బిల్వార్చన-కోటి కుంకుమార్చనల బిల్వాలు,అలాగే లక్ష బిల్వార్చన బిల్వాలను,కుంకుమలను స్వర్ణముఖి నదిలో నిమజ్జనం చేయటానికి నిర్ణయించినట్లు ఇఓ రామారావు వివరించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6



నుంచి 7గంటల వరకు మహాదీపారాధన రాత్రి 8గంటలకు పంచమూర్తుల గ్రామోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ వివరించారు.

సాయంత్రం 6గంటల నుంచి నదీ హారతులు ప్రారంభం
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా నిర్వహించే స్వర్ణమ్మ నదీ హారతులను మంగళవారం నిర్వహించుటకు స్వర్ణముఖి నదిలో ఏర్పాట్లు చేసామన్నారు. నదిలో నిండుగా నీరుండటంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు.అంతేకాక భక్తులు తిలకించే రీతిలో ఏర్పాట్లు చేసామన్నారు. జలవినాయక ఆలయం నుంచి పడమరగా నదిలో హారతులకు ఏర్పాట్లు చేసామన్నారు.

# వేనాడు దీవిలో ఏనాడూ చూడని వరద బీభత్సం
### 800 ఎకరాల్లో వరిపంట మునక
### పాడై పాచిపోయిన పంటను చూసి గోడుమంటున్న రైతన్న

తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త
తడ మండలం వేనాడు దీవిలో మిచౌంగ్ తుపాను ప్రభావం తీవ్రంగా పడింది. ఏనాడూ చూడని వరద బీభత్సం వేనాడు దీవిని చుట్టేయడంతో అక్కడ 800 ఎకరాల వరి పంట ఇప్పటికీ వరదలోనే ఉంది. ఈ దీవికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఏ ఒక్క అధికారి కూడా సోమవారం దాకా వెళ్లలేకపోయారు. అయితే మండల వ్యవసాయాధికారి కాంచన తన సిబ్బందితో సోమవారం అతి కష్టంమీద ఈ దీవికి వెళ్లి మునిగిపోయిన పంట పొలాలను పరిశీలించారు. అన్నిచోట్లకు వెళ్లలేకపోయామని, కేవలం రెండు ప్రాంతాల్లో వంద ఎకరాల పంటను మాత్రం పరిశీలించి వచ్చామని ఎంఎఓ తెలిపారు. ఇప్పటికి కూడా రెండు అడుగులకు మించి అక్కడ పొలాల్లో నీళ్లు నిలిచి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. పులికాట్ సరస్సు మధ్యలో షార్ రోడ్డు నుంచి వేనాడు వరకు వేసిన రోడ్డుపై నీళ్లు ప్రవహించడంతో అక్కడ ప్రయాణం సాధ్యం కాలేదు. సోమవారం ఈ గ్రామానికి వెళ్లడానికి అధికారుల బృందం తీవ్ర ఇబ్బందులు పడింది. వేనాడు దీవి ప్రధాన గ్రామంతో పాటు మూల, పల్లెపేటకుప్పం, ఆలాపత్రి, మట్టిగుంట వంటి కాలనీలు సైతం వరద దిగ్బంధంలో చిక్కుకునే



ఉన్నాయి. పంట నష్టపోయిన రైతులు అధికారులను చుట్టుముట్టి లబోదిబోమన్నారు. పొలాల్లోకి తీసుకెళ్లి అక్కడ పాచిపోయిన, పాడైపోయిన పంటను చూపించారు. ఇప్పటికే 60 రోజులకు మించి ఎదిగిన పైరు కొన్నిచోట్ల ఎన్ను తీస్తూ ఉందని, మరో నెలరోజుల్లో కోతకు వచ్చిందని ఆశపడిన తమకు ఈ తుపాను వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు.

## సమ్మెపై మున్సిపల్ అధికారులకు నోటీసులు



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ సమ్మె చేపట్టాలని జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం చిత్తూరు మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లకు మున్సిపల్ కార్పరేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ఎఐటియుసి నాయకులు గోపినాథ్, మణి, దాసరి చంద్రలు కలిసి నోటీసులు అందజేశారు.

## మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేక వాక్సిన్ సద్వినియోగం

యాదమరి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
మిషన్ ఇంద్రధనస్సు ప్రత్యేక వాక్సిన్ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని ఆరిమాకులపల్లి గ్రామంలో పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణలు ప్రజలతో మాట్లాడుతూ మాతా శిశు మరణాలు పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను ప్రారంభించిందని, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని అర్హులైన చిన్నారులు, గర్భవతులను గుర్తించి వారికి మిషన్ ఇంద్రధనస్సు అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా మూడు నెలల పాటు వాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలు మరింత మెరుగుకు చర్యలు

పాలసముద్రం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు కలసికట్టుగా విధులు నిర్వర్తించాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి కోరారు. మండలంలోని ఆముదాల పంచాయతీ కావేరిరాజపురం ఎంపిపి ప్రభుత్వ పాఠశాలలో వసతులపై ఎంపిడిఓ రామనాథరెడ్డి సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రామనాథరెడ్డి పాఠశాల విద్యార్థులతో మాట్లాడి ఏం నేర్చుకొంటున్నారు! మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా వుంది! అని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎఓ విద్యావతి, ఈఓఆర్డీ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణలు పాల్గొన్నారు.

## అర్ధగిరి హుండీల ద్వారా 11.16 లక్షలు ఆదాయం

తవణంపల్లె, డిసెంబర్ 11 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 11.16 లక్షలు రూపాయలు ఆదాయంగా లభించింది. సోమవారం ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ హనుమంతురావుల ఆధ్వర్యంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 98 రోజులకు గాను 11,16,583 రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి చలపతి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివమానందరెడ్డి, పాలకమండలి సభ్యులు పార్థసారథిరెడ్డి, సందీప్, అర్చకులు, సిబ్బందితో పాటు ఆలయ, బ్యాంకు,సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్ర పథకాల పంపిణీ

తవణంపల్లె, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులందరికి ఈపథకాలు అందించేందుకు వీలుగా మండలంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో లబ్ధిదారులకు కేంద్ర పథకాలను పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లె, పల్లెచెరువు గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్,ఇండియన్ బ్యాంకు ప్రతినిధి మురళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలచంద్ర యాదవ్,నాయకులు భాను ప్రకాష్,వినాయకం, శ్రీనివాసులులతో పాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న కూకట్‌పల్లె ఎమ్మెల్యే

కాణిపాకం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ కూకట్‌పల్లె ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

## 15లక్షలతో కుప్పం చెరువుకు ఫెన్సింగ్

### - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కుప్పం పాతపేట వద్ద ఉన్న కుప్పం చెరువు చుట్టూ 15లక్షలతో ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ తెలిపారు. సోమవారం చెరువు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటుపనులను ఛైర్మన్ భూమిపూజ చేసి ప్రారంభించారు. చెరువు వద్ద కంచె ఏర్పాటుతో పాటు ప్రజలు కూర్చునేందుకు సైతం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రణాళికా బద్ధంగా కుప్పం మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సయ్యద్ అలీ, రంగయ్య, రాజ్‌కుమార్, మోహన్‌రాం, గణపతి, సురేష్, కో ఆప్షన్ అరుల్, ఐదో వార్డు ఇన్‌చార్జ్ సిపి మనోహర్, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### - ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని

కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కుప్పం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని ఠాకూర్ క్షత్రియ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కమతమూరులో వైకాపా నేత నిత్యానంద అధ్వర్యంలో జగనన్నతో జనం భరతన్నతో మనం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్ దంపతులకు గ్రామస్తులు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. నాలుగున్నర ఏళ్ల వైకాపా పాలనలో ప్రజలకు కలిగిన లబ్ది గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీ భరత్‌ను మీ బిడ్డగా ఆదరించాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు రవి, సయ్యద్ అలీ, నాగరాజు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరనున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జ్ వజీర్



కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జ్ వజీర్ బాషా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. తాజాగా ఆయన మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్‌ను కుప్పంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దీంతో వజీర్ బాషా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమనే తెలుస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మైనార్టీ నేతగా వజీర్ పనిచేశారు. ఈయన చేరికతో కాంగ్రెస్ పార్టీ కుప్పంలో మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది. కాగా త్వరలో ఎపి రాజకీయాల్లో వైఎస్ షర్మిల ప్రవేశిస్తే కాంగ్రెస్‌ను వీడిన మరికొందరు నేతలు, తటస్థులు సైతం కాంగ్రెస్‌లో చేరతారని తెలుస్తోంది. ఏది ఏమైనా కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపుతో ఇప్పుడు పలువురు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపడం విశేషం.

## వైకాపా జిల్లా యువత అధ్యక్షుడిగా మోహన్‌బాబు నియామకం



కుప్పంరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త
చిత్తూరు జిల్లా వైకాపా యువత విభాగం అధ్యక్షుడిగా వానగుట్టపల్లికి చెందిన మోహన్‌బాబును నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సోమవారం నియామకపత్రాలను ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా మోహన్‌బాబు అందుకున్నారు. జిల్లాలో పార్టీ యువత విభాగం బలోపేతానికి శక్తివంచన లేకుండా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నేత శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మనోహర్ అరెస్ట్ అప్రజాస్వామికం

కుప్పంరూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త
జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అరెస్ట్ అప్రజాస్వామికమని కుప్పం నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త డా॥ నరేష్ పేర్కొన్నారు. వైజాగ్‌లోని టైకూన్ జంక్షన్‌కు వెళ్లకుండా నోవాటెల్ హోటల్‌లో నిర్బంధించడం దారుణమన్నారు. ఇది వైజాగ్ పోలీసుల అనైతిక చర్య అన్నారు. త్వరలోనే ఈ అరాచకపాలనకు ప్రజలే చరమగీతం పాడుతారని పేర్కొన్నారు. నాదెండ్ల అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కరాటే పోటీల్లో మదర్ థెరిసా విద్యార్థుల ప్రతిభ.

పెద్దపంజాణి డిసెంబర్ 11 ప్రభాతవార్త :




ఇటీవల కర్ణాటకరాష్ట్రం గౌరీబిదనూరులో జరిగిన జాతీయస్థాయి ఓపన్ కరాటే పోటీల్లో పెద్దపంజాణి మండలం లింగాపురం సమీపంలోని మదర్‌థెరిసా(సిబిఎస్‌ఈ)పాఠశాల విద్యార్థిని విద్యార్థులు 38మందిపాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు మదర్‌థెరిసా విద్యా సంస్థల చైర్మన్ ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు. కటా,కుమితే విభాగాల్లో 14మెదటి బహుమతులు,12 ద్వితీయ బహుమతులు,24తృతీయ బహుమతులతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యదశ నుండే మానసికంగా,శారిరకంగా ధృఢంగా ఎదగాలని సందేశమిచ్చారు.పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్,కరాటే మాష్టర్ డా॥సదాశివ విద్యార్థినివిద్యార్థులను ప్రశంసించారు.

## సంఘటితంగా సమస్యలు పరిష్కారం : వీరశైవలింగాయత్

చౌడేపల్లి, డిసెంబర్ 11 ప్రభాతవార్త
అందరం కలసి సంఘటితంగా ఏర్పడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని వీరశైవలింగాయత్ జంగమ సంఘం నాయకులన్నారు. కార్తీకమాసం ఆఖరు సోమవారం కావడంతో పుంగనూరు సమాధుల కిరీటిమఠం నందు అన్నదాన కార్యక్రమం జరిగింది. జమీందారుల ఏలుబడిలో వున్న పుంగనూరు ప్రాంతం సాంప్రదాయ, సాంస్కృతిక, దేవాలయాలకు నిలయంగా వుందన్నారు. అధ్యాత్మికతకు మారుపేరైన ఇలాంటి చోట కార్తీక వనభోజనం పూర్వజన్మసుకృతమని పలువురన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గంలోని వీరశైవలింగాయత్, జంగమ కులస్తులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మనోహర్ అరెస్టు అప్రజాస్వామ్యకం

### -జనసేన పగడాల రమణ

పుంగనూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త :
జనసేన పార్టీ రాష్ట్రనాయకుడు,పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అప్రజాస్వామ్యకంగా అరెస్టు చేయడం దారుణమని,వీటన్నింటికీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని జిల్లా జనసేన సీనియర్ నాయకుడు పగడాల రమణ హెచ్చరించారు. ఈమేరకు ఆయన అధ్వర్యంలో పుంగనూరులో జనసేన నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. విశాఖ పట్టణంలో టైక్వాన్ కూడలి మూసివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయమై శాంతియుత ఆందోళన నిర్వహించడానికి వెడుతున్న తమ నాయకుడిని అరెస్టుచేయడం విచారకరమన్నారు. పట్టణాధ్యక్షుడు నరేష్‌రాయల్,రూరల్ అధ్యక్షుడు విరూపాక్షిలు మాట్లాడుతూ ఈఎన్నికలలో ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు జనసేన అధ్వర్యంలో ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు.గ్రామగ్రామాన జనసేనను మరింత బలోపేతం చేస్తామని చౌడేపల్లి అధ్యక్షుడు పురుషోత్తం,రొంపిచర్ల అధ్యక్షుడు శేఖర్‌రాయల్,పులిచర్ల అధ్యక్షురాలు దీపామోహన్,సీనియర్‌లు మురళీరాయల్,బాలాజీ,హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ స్పందనకు 3 సమస్యలు

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలు పరిష్కరించడానికి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమీషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఈ వారం నగర ప్రజల నుండి మూడు సమస్యలపై వినతిపత్రాలు అందాయి. అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్ ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెప్మాకు సంబంధించి 2, ప్రజారోగ్య విభాగంకు సంబంధించి ఒక సమస్య ఈ కార్యక్రమంలో అధికారులకు ప్రజల నుండి అందాయి. ఈ కార్యక్రమంలో ఎంఇ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైస్ చైర్మన్ బాలయ్యను పరామర్శించిన చైర్ పర్సన్, కౌన్సిలర్లు

వెంకటగిరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త
కంటి ఆపరేషన్ చేసుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ చేతురాశి బాలయన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద, పట్టణ వైసిపి కన్వీనర్ ఢిల్లీ బాబు కౌన్సిలర్లు పరామర్శించారు. ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, సుబ్బారావు, మురళీకృష్ణలు పరామర్శించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



గూడూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త
మీచౌంగ్ తుఫాను వలన గూడూరు మండల పరిధిలోని గ్రామాల్లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేసారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు వేసిన వరినారు ఇటీవల వచ్చిన తుఫాను వలన కొట్టుకుపోవడం జరిగిందని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బివి రమణయ్య, సురేష్, బి. చంద్రయ్య, ఆడపాల ప్రసాద్, పామంజీ మణి, గుర్రం రమణయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గూడూరు పట్టణంలోని శ్రమిక్ నగర్‌లో నివసిస్తున్న 24 కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన వరద సాయం అందలేదని, ఇకనైనా అధికారులు స్పందించి బాధితులకు సహాయం అందించాలని, శ్రామిక నగర్ వాసులతో కలిసి సిపిఎం పార్టీ నాయకులు ఆర్డీవో కిరణ్ కుమార్‌కి వినతిపత్రం అందజేసారు.

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు మనపాటి శ్రీనివాసులు దాతృత్వంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, డాక్టర్ రాజాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఇబ్రాహీం, బాబు, జగదీష్, సాయి, రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

## భవిత స్కూలులో దివ్యాంగుల దినోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని భవిత స్కూలులో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ కాపులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొని విద్యార్థులను స్ఫూర్తినిచ్చే విధంగా ప్రసంగించారు. దివ్యాంగులను మానసికంగా ఇబ్బందులు పెట్టకుండా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అందుకుంటారని చెప్పారు. భరద్వాజ సేవాసంస్థ అధ్యక్షులు ఎంఎం చంద్రబాబు తమ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు స్టీలు వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అందజేసిన ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్య, ప్రధానోపాధ్యాయులు శేఖర్, పిఆర్‌పిలు మహేష్, అంకయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు సత్వర సాయం చేయండి

సూళ్లూరుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
సూళ్లూరుపేట నియోజకవర్గంలో వరద బారిన పడి బాధపడుతున్న బాధితులకు సత్వరమే సాయం చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష వైఖరి అవలంబిస్తోందన్నారు. కంటితుడుపు చర్యగా సాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్ళు, పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు ఏఐడిడిఎస్‌యు అధ్యక్షులు బండి గోపాల్ స్పష్టం చేశారు. ఆ మేరకు సోమవారం విద్యానగర్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు అందరినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సురెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని ప్రభుత్వ విఎస్ఎస్‌సి డిగ్రీ కళాశాలలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులచే ఇంధన పొదుపు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విక్టోరియా, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ వి.రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి షార్ వై జంక్షన్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ వరప్రసాద్, శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు.

## అభయశంకర ఆలయంలో కార్తీక పూజలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం, అభయశంకర ఆలయాల్లో కార్తీక చివరి సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. అభయ శంకర ఆలయంలో ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని, స్వామివారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వేనాటి సతీష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్డీఓ కృషి అభినందనీయం

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
కోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థినులు నడవలేక రాళ్లు గుచ్చుకుంటూ గత ఐదునెలలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ ప్రాంగణంలో ఉపాధ్యాయులు సైతం కింద పడి ప్రమాదాలకు గురయ్యారు. కానీ ఏ ప్రజాప్రతినిధి గాని అధికారి గాని పట్టించుకోలేదు. పత్రికల్లో కథనాలు రావడంతో, సోషల్ మీడియాతో కూడా కథనాలు వచ్చాయి. ఆర్డీఓ కిరణ్‌కుమార్ స్పందించారు. తన సొంత నిధులతో పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుట్టారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఫ్లోరింగ్ చేయించారు. దీంతో ఆర్డీఓ కిరణ్‌కుమార్ కృషిని విద్యార్థినుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

## 14, 15 వ తేదీల్లో విధులకు రాలేం

కోట,డిసెంబర్ 11 ప్రభాతవార్త
సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14,15వ తేదిల్లో కలెక్టరేట్ వద్ద నిరవన కార్యక్రమలు వంటా వార్పు చేపట్టాలని ఆశా కార్యకార్తలు సంఘం పిలుపునిచ్చింది.అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఆరెండు రోజుల్లో విధులకు హాజరు కాలేమని చెప్పారు. గూడూరు నియోజకవర్గంలోని కోట,వాకాడు, చిట్టమూరు మండలాల్లో ని ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యధికారులకు ఆశ వర్కులు తెలిపారు. అయితే పోలీసులు తమను అడ్డుకొంటారని వారంతా రహస్యంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్,కు వేళ్లనున్నారు.

## తడలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం

తడ, డిసెంబర్ 11 ప్రభాతవార్త
తడ మండలం తడకండ్రిగలోని నాన్‌భవిత సెంటర్‌లో సోమవారం ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం తరపున ట్యాబులను సరఫరా చేశారు. వీటి ద్వారా విద్యార్థులకు సులభంగా బోధన అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సురేష్, ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర, నాన్ భవిత ఉపాధ్యాయులు కల్పన, ప్రియాంక, మంజుల, పలువురు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త
ఇటీవల తుపాను, వర్షాల కారణంగా పల్లెల్లో వర్షపునీరు డ్రైనేజి కాలువల్లో పలు కాలనీలలో ప్రవహించింది. ఈ క్రమంలో మండలంలోని చెందోడు పంచాయతీలోని పలు వీధుల్లో గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీలో సోమవారం కార్యదర్శి కిరణ్‌కుమార్ పంచాయతీ కార్మికుల చేత బ్లీచింగ్ చల్లించారు.

## గ్రామాల అభివృద్ధికై సర్పంచ్‌ల సమర శంఖారావం కార్యక్రమం

### మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త
సర్పంచ్‌ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని గ్రామాల అభివృద్ధికై సర్పంచ్‌ల సమర శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం పంచాయితీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో టిటిడి కళ్యాణ మండపం నందు నిర్వహిస్తున్న సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంస్థాగత ఎన్నికలలో గెలుపొందిన సర్పంచులు, ఎంపిటిసి, జడ్పిటిసిలను కేవలం ఉత్సవ కమిటీ సభ్యులుగా చేసింది. స్థానికంగా సర్పంచ్ అంటే ఎవరికి లేని అధికారం అతనికి ఉంటుందన్నారు. ఈ నాలుగు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సుమారు రూ.35 వేల కోట్లను దారిమళ్లించి తన సొంత పథకాలకు, అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వాడివేసుకున్నది మా పంచాయితీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి త్రాగు నీటి కుళాయి పథకం అయిన జల్ జీవన్ మిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించి వెంటనే ఆ పథకం పనులు అన్ని గ్రామాల్లో ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర సర్పంచ్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి నాగేందర్ రెడ్డి, పంచాయితీ చాంబర్ ఉపాధ్యక్షులు సుబ్బరామయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు శివకుమార్, పంచాయితీ చాంబర్ సభ్యులు మునీష్, భాస్కర్ రెడ్డి బిల్లు చెంచు రామయ్య, వెంకటేశ్వర్లు రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, పులిమి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసిలు భారతి రెడ్డి, పద్మమ్మ, సర్పంచ్ పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, కోకోల్లు మధు యాదవ్, ఎంపిటిసి సంసుద్దిన్, మాజీ ఎంపిపిలు కందల బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యం

### గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త
సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్మోహన్ రెడ్డి సిఎంగా రాష్ట్రానికి ఎంతగానో అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద తెలిపారు. వెంకటగిరి పట్నం 14,15 వార్డులలో రాష్ట్రానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎందుకు అవసరం అనే కార్యక్రమం నిర్వహించి, పార్టీ జెండాను ఎగరవేశారు. సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నట్లు చెప్పారు. సచివాలయం వాలంటీర్ల వ్యవస్థ ప్రజలకు ఎంతగానే ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ డిల్లీ బాబు, కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్ శంకరయ్య, చంద్రశేఖర్ రెడ్డి, నారాయణ, కళ్యాణి, శ్రీనివాసులు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల డిమాండ్ పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాము

### ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరు జాన్

వెంకటగిరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త
మున్సిపాలిటీలో పనిచేసిన వర్కర్స్‌కు వెంటనే జీతాలు చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ కోరారు. డిమాండ్ సాధనకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేసారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేసారు. వెంకటగిరి మున్సిపాలిటీలోని కార్మికులకు ఎనిమిది నెలల నుండి జతాలు ఇవ్వలేదన్నారు. కార్మికులు ఖాతాలో ఈపిఎఫ్లను కూడా అందజేయలేదన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. మున్సిపాలిటీలో కార్మికులపై వేధింపులు పెరిగినట్లు తెలిపారు. బాలాజీ బుజ్జమ్మ, శ్రీనివాసులు చర్చలు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు వైఏపీ నీడ్స్ జగన్ కిట్లు అందజేత

బాలాయపల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త
మన్నూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు గూడూరు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం వాలంటీర్లకు వైఏపీ నీడ్స్ జగన్ కిట్స్‌ను అందజేసారు. ప్రతి ఇంటికి వెళ్లి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు ఏపీకి జగన్ ముఖ్యమంత్రిగా మరోసారి కావాలని మండల కన్వీనర్ వెందోటి కార్తిక్ రెడ్డి తెలిపారు. మరల సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని ఆశీర్వదించాలని కార్తీక్ రెడ్డి కోరారు. అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు వరం లాంటిదని అన్నారు. జయంపులోని పారిశుద్ధ్య ఓ కార్మికుని కుమార్తె తాను చదివిన కాలేజీలోనే ఇంజనీరింగ్ చదవడం సిఎం జగన్ తీసుకువచ్చిన మార్పుకు నిదర్శనమని కార్తిక్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీల రాణి, ఈవోపిఆర్డి శ్రీనివాసులు, సర్పంచ్ బట్టేపాటి అర్చన, మండల కన్వీనర్ వెందోటి కార్తిక్ రెడ్డి, వైసిపి నేతలు బాచి చౌదరి, కిషోర్, వేమూరి వెంకటరమణ రెడ్డి, గుర్రం రామ్మూర్తి, అల్లం శేఖర్, సర్వేపల్లి సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య దర్శనం అద్భుత అనుభూతి : సంజీవ్ గోయంకా



శ్రీకాళహస్తి, డిసెంబరు 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరస్వామి, తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారం దర్శనానికి సోమవారం విచ్చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త సంజీవ్ గోయింకాకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మరియు కుమారుడు ఆకర్షరెడ్డితో పాటుగా కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సంజీవ్ తమ కుటుంబ సభ్యులతో దర్శనార్థం విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువ కప్పి స్వాగతం పలికారు. ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్‌పీజీఎస్ మల్టీ నేషనల్ కంపెనీ అధినేత సంజీవ్ గోయింకా ఆయన కుటుంబ సభ్యులకు శ్రీకాళహస్తీశ్వరస్వామి మరియు తిరుమల శ్రీవారి దర్శినం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూధనరెడ్డి మాట్లాడుతూ ఆర్‌పిఎస్‌జి మల్టీ నేషనల్ కంపెనీ అధినేత అయిన సంజీవ్ గోయింకాను శ్రీకాళహస్తి నియోజకరవర్గానికి పారిశ్రామికంగా అభివృద్ధి తొడ్పాటు అందించాలని విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో ఈ విషయం చర్చిస్తానని తెలిపారు. అనంతరం సంజీవ్ గోయింకా కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.



## సంజీవ్ గోయింకాకు స్వాగతం

రేణిగుంట, డిసెంబరు 11 ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త సంజీవ్ గోయింకాకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. సంజీవ్ తమ కుటుంబ సభ్యులతో శ్రీవారి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువ కప్పి ఎమ్మెల్యే అభిమానాన్ని చాటుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్‌పీజీఎస్ మల్టీ నేషనల్ కంకపెనీ అధినేత సంజీవ్ గోయింకా ఆయన కుటుంబ సభ్యులకు స్వాగతం పలికిన అనంతరం ఎమ్మెల్యే, సంజీవ్ గోయింకా కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

# ఆడుదాం ఆంధ్రకు పక్కా ఏర్పాట్లు

**- డిస్ప్లే బోర్డుల ఏర్పాటు వేగవంతం - సత్వరం అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ- ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ బాలాజీ, డిఎల్‌డిఓ రవికుమార్‌తో కలిసి ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఓఆర్డీలు, ఎన్నికల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఆట వస్తువులు క్షేత్ర స్థాయికి చేరుకొన్నాయని, వాటికి సంబంధించిన రిసిప్టులను సత్వరం అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ వార్డు, అర్బన్ ప్రాంతాల్లో పెండింగ్ వున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డిస్ప్లే బోర్డుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో మార్పులు, చేర్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో వున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు వ్యవహరించాలని, లేని పక్షంలో తీవ్ర చర్యలు వుంటాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫారం-7 విషయంలో అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారు, వెళ్ళిన వారి క్లైములు పట్ల నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ పూర్తి చేసి ఈకెవైసి కార్యక్రమం మంగళవారం సాయంత్రానికి పూర్తి చేయాలన్నారు. అలాగే ఫ్రీ హోల్డ్‌రైట్ విషయంలో విఆర్ఓలు వెంటనే చర్యలు తీసుకోవాలని

## నాదెండ్ల మనోహర్ అరెస్టు అప్రజాస్వామికం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : విశాఖలో టైకూన్ జంక్షన్ మూసివేతను నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న జనసేన రాజకీయాల వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను విశాఖ నోవాటెల్ హోటల్ వద్ద అడ్డుకుని పోలీసులు అరెస్టు చేయడాన్ని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత కోట అన్నారు. ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాటాలను వైకాపా ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వర్షనష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి

**- పంట నష్టపోయిన రైతుకు విత్తనాల కోసం నివేదిక- ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు**

చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ఇటీవల కురిసిన వర్షాలకు సంబంధించి పంట నష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పక్కాగా చేపట్టి పూర్తి చేయడం జరిదింని ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ జికె ద్వివేది, స్పెషల్ కమీషనర్ హరికిరణ్‌లు సోమవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో పంట నష్టం వివరాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు వివరిస్తూ జిల్లాలో 20 మండలాల్లో 125 గ్రామాల్లో పంట నష్టం జరిగిందని, ఇందులో 619 హెక్టార్ల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయన్నారు. అలాగే రబీకు సంబంధించి 215 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని, ఈ పంటలకు ప్రత్యామ్నాయంగా పంటలు వేసుకోవడానికి 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అలాగే 32 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటల నష్టం జరిగిందని, దీనికి సంబంధించి నివేదకలు పంపడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీకి వివరించారు. వ్యవసాయ శాఖ చీఫ్ కమీషనర్ మాట్లాడుతూ ఇతర వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి వర్షాలకు క్షేత్ర స్థాయిలో ఎక్కడైనా నష్టం జరిగి వుంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి మళ్ళీ పంపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన రైల్వే అండర్‌బ్రిడ్జిలు

**- గ్రామాలకు రాకపోకలు బంద్ - అవస్థలు పడుతున్న ప్రజలు**



దొరవారిసత్రం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : కేంద్రప్రభుత్వం అత్యాధునిక టెక్నాలజీతో రైల్వే గేట్ల వద్ద అండర్‌బ్రిడ్జిలను కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేసింది. అయితే ఈ రైల్వే అండర్‌బ్రిడ్జిలు గ్రామీణ ప్రజలకు శాపంగా మారాయి. రైల్వే ట్రాక్‌లకు సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రం దొరవారిసత్రంలో ఏర్పాటు చేసిన రైల్వే అండర్‌బ్రిడ్జి 20 నుంచి 30 గ్రామాలకు వెళ్లే ప్రధానమైన రోడ్డు మార్గం. అయితే ఆయా గ్రామాల నుంచి ఇటు మండల కేంద్రానికి రావాలన్నారు. పట్టణాలకు వెళ్లాలన్నా ప్రధానమైన రోడ్డు, అండర్ బ్రిడ్జిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లలేక, రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొరవారిసత్రం, అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, నేతాజీనగర్, మినమనముడి గ్రామాల్లో కోట్ల రూపాయల నిధులతో అండర్‌బ్రిడ్జిలు ఏర్పాటుచేశారు. ఈ బ్రిడ్జిలలో ఇటీవల సంభవించిన తుపాను కారణంగా వర్షపు నీరు చేరింది. ఇక్కడ నామమాత్రంగా ఏర్పాటు చేసిన ఇంజన్లు మరమ్మతులకు గురవడంతో సంబంధిత అధికారులు ఆ నీటిని తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. అత్యవసరంగా ఎవరైనా ఆసుపత్రులకు వెళ్లాలంటే ఆ చుట్టుపక్కల గ్రామాల వారికి దారి లేదు. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అండర్ బ్రిడ్జిల వద్ద ఉన్న వరద నీటిని తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## శివాలయాల్లో భక్తుల సందడి

కోట, డిసెంబర్ 11 ప్రభాతవార్త : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో కోట మండలంలోని శివాలయాల్లో సందడి వాతావరణం కనిపించింది. ఎక్కడికక్కడ సామాజిక వర్గాల వారీగా వన సమారాధనలు నిర్వహించారు. కోటలోని శివాలయం, చిట్టేడు, అల్లంపాడు, గూడలి తదితర గ్రామాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలువురు భక్తులు, యువత సముద్ర స్నానాలు చేసి పూజలు చేశారు. అనంతరం కోటలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## దర్గాను దర్శించుకున్న బొజ్జలరిషితారెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : పట్టణంలోని 32వ వార్డు దర్గామిట్టలో కులమతాలకు అతీతంగా ఉన్న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా చిష్టియల్ ఖాదరీ దర్గాను సోమవారం బొజ్జలరిషితారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి కంటా రమేష్, యూనిట్ ఇన్‌ఛార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి, వార్డు నాయకులు రుకేష్, షఫి, మధు, మునిరాజ, సుబ్రమణ్యం, యశ్వంత్ ఆధ్వర్యంలో దర్గాను దర్శించుకున్నారు. ఈసందర్భంగా దర్గా నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ మిచెంగ్ తుఫాను ప్రభావంతో ఎక్కువగా ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో పంటనష్టం జరిగిందని ఏనాయకులు కూడా తుఫాను బాధితులను పరామర్శించి వారిని ఆదుకున్నది లేదన్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని పనులు చేపడుతా మన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జిలానీ, ఖాదర్‌బాషా, షాకిరాలీ, బాబాఫరీద్, అస్మత్, తదితరులు పాల్గొన్నారు.

## సదాశివకోన డ్యాంకు జలహారతులు



శ్రీకాళహస్తిరూరల్(ఏర్పేడు), డిసెంబర్ 11 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని సదాశివకోన డ్యాంలో నీటి జలతో కళకళలాడుతుండడంతో సోమవారం ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి హజరై భక్తి శ్రద్దలతో జలహారతులు ఇచ్చారు. ముందుగా హారతులకు గుడిమల్లం పరశురామేశ్వరాలయం నుంచి సారెను ఆలయ అధికారులతో కలసి పవిత్రారెడ్డి ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు నిర్వహించి సదాశివకోనలో ఉన్న గంగమ్మకు హారతులు ఇచ్చి సారెను సమర్పించి రైతన్నలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏర్పేడు మండల ఇన్‌ఛార్జి గున్నేరికిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రమణయ్యాయాదవ్, గుడిమల్లం ఆలయ ఛైర్మన్ నరసింహయాదవ్, బత్తిశెట్టి, నాగార్జున్‌రెడ్డి, దాము, ప్రకాష్‌యాదవ్, దినేష్, సుబ్రమణ్యంయాదవ్, హరిగౌడ్, మునిరాజ, లోకేష్, దాము పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కల్యాణవైభోగం....కపిలేశ్వరకామాక్షి అమ్మవారు

**శాస్త్రోక్తంగా ముగిసిన రుద్రయాగం**



తిరుపతి,డిసెంబర్ 11ప్రభాతవార్త: వైష్ణవ ఆలయం కపిలేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస విశేష హోమాల్లో భాగంగా రుద్రయాగం సోమవారంతో ముగిసింది. ఆలయంలో 11రోజులుపాటు రుద్రయాగం నిర్వహించారు. సమాప్తి సందర్భంగా మహాపూర్ణాహుతి, మహాశాంతి అభిషేకం, కలశ ఉద్వాసన, కపిలేశ్వరస్వామి మూలవర్లకు కలశాభిషేకం అర్చకులు జరిపించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఎఈఓ సుబ్బరాజు. సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## కైలాసనాధకోనలో కార్తీక సోమవారం సందడి



నారాయణవనం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : నాల్గవ కార్తీక సోమవారంతో కైలాసనాధకోనకు వందలాది మంది భక్తులు తరలివచ్చి కార్తీకస్నానం చేశారు. కార్తీక మాసంలో చేసే పవిత్రస్నానాల వల్ల పుణ్యం లభిస్తుందని భావించే భక్తులు ఉదయం 3గ ంటల నుంచే కైలాసనాధ కోనలోని జలపాత ంలో పవిత్రస్నానాన్ని చేయడానికి పోటీపడ్డారు. పవిత్రస్నానాన్ని ఆచరించిన తర్వాత చాలమంది భక్తులు అయ్యప్ప మాలను ధరించారు. అనంతరం కైలాసనాధున్ని, కామాక్షాంభికా అమ్మ వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. టెంకాయహారతులు, నైవేద్య ం సమర్పించుకున్నారు.

## భక్తుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు?




శ్రీకాళహస్తి,డిసెంబర్ 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ఉన్నతాధికారులు,ధర్మకర్తల మండలి భక్తుల సదుపాయాలకు సంబంధించి పరుగులు తీస్తూ పర్యవేక్షిస్తుండగా సిబ్బంది నిర్లక్ష్యంతో అభాసుపాలౌతున్నారు. సాధారణంగా శని,ఆది,సోమవారాల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. అయితే దీనికి తగ్గట్లు ఏర్పాట్లు, మంచినీటి సరఫరా అందించాల్సి ఉంది.కానీ సోమవారం ఆలయంలో మంచినీరు కరువైంది.సోమవారం తాగటానికి మంచినీరు కోళాయిల్లో రాలేదు. కాళ్ళు కడుక్కోటానికి చుక్క నీరు లేదు. దాంతో భక్తుల పట్ల ఇంత నిర్లక్ష్యమా? అని భక్తులు నొచ్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో తప్పిదాలు జరిగినపుడు చర్యలు తీసుకుంటే మరో సారి అలాంటి పొరబాట్లు జరగవు.కానీ అలాంటి నిర్ణయాలు లేవు. ఎంత పెద్ద తప్పు చేసినా చర్యలుండవు. కారణం ఆ తప్పు చేసే వారు ఎవరో ఒక రాజకీయ నాయకుని నీడలో ఉండటంతో తప్పిదాలు జరుగుతూనే ఉన్నాయి. అదే సోమవారం మంచినీటి సరఫరా లేక భక్తులు తల్లడిల్లారు.

## శివయ్య సేవలో మంత్రి రోజా



శ్రీకాళహస్తి,డిసెంబర్ 11 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో భక్తులతో కిట కిట లాడింది. అలాగే పలువురు విఐపిలు కూడా స్వామి అమ్మ వార్ల సేవలో పాల్గొన్నారు.ఈ నేపధ్యంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా హాజరయ్యారు. ఆమెకు ఆలయాధికారులు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో, వేదపండితులతో స్వాగతం పలికారు. ఆమెకు ఏర్పాట్లును మాజీ స్కిట్ డైరెక్టర్ లోకేష్ యాదవ్ పర్యవేక్షించారు.మంత్రి రోజా ప్రధాన మూల విరాట్టులనే కాకుండా పరివార దేవతలను కూడా దర్శించుకున్నారు. దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## కార్తీక దీపోత్సవానికి పోటెత్తిన భక్తజనం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : కార్తీమాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వ స్వామి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం ఎదురుగా ఆకాశదీపాన్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఇఓ కెయస్.రామారావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు విచ్చేసి ఆకాశదీపాన్ని వెలిగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతి పాత్రమైందని తెలిపారు. కార్తీకదీపాన్ని దర్శించుకోవడానికి ప్రతిరోజు స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు దర్శించునే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఆలయన డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌నాయుడు, దేవస్థాన పాలక మండలి సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయ...ఆధునీకరణ పనులు వేగవంతం చేయండి

**-టిటిడి ఛైర్మన్ భూమన ఆదేశం**



తిరుపతి,డిసెంబర్ 11ప్రభాతవార్త: తిరుపతి నగర గ్రామదేవతగా విరాజిల్లుతున్న తాతాయ్య గుంట గంగమ్మ ఆలయం ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆలయ వర్గాలను ఆదేశించారు. ఆలయంలో జరుగుతున్న పనులను సోమవారం ఉదయం నగరపాలకసంస్థ మేయర్ డాక్టర్ శిరీష,ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, వెంకటేశ్వం‌రెడ్డితో కలసి పరిశీలించారు. అంతకుముందు ఆలయంలోనికి చేరుకుని గంగమ్మతల్లిని దర్శించుకుని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా గంగమ్మ ఆలయం పునఃనిర్మాణ పనులను స్వయంగా ఎమ్మెల్యేగా భూమన చేపట్టి నిర్మించిన విషయం విదితమే. ఆలయంకు విచ్చేసే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని, అమ్మవారి దర్శనంలో అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

## మహిళలపై నేరాల్లో ఏపిదే అగ్రస్థానం : చక్రాల ఉష

శ్రీకాళహస్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : మహిళలపై నేరాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. ఈమేరకు ఆమె సోమవారం మాట్లాడుతూ మహిళ ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనల్లో ఏపి తొలిస్థానంలో ఉండడం బాధాకరం అన్నారు. విస్తీర్ణం, జనాభాలోను మనకంటే పెద్దదైన మహారాష్ట్ర ఈ అంశంలో రెండో స్థానంలో ఉండగా ఏపిలో అక్కడి కంటే ఎక్కువగా నేరాలు చోటుచేసుకున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నేరాలు అధికమయ్యాయన్నారు. పాలకుల అసమర్ధతతోనే ఈ నేరాలు పెరిగిపోయాయని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

## కమ్ముకుంటున్న మేఘాలు.. ఆందోళనలో అన్నదాతలు

దొరవారిసత్రం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : వారంరోజుల క్రితం వచ్చిన మిచౌంగ్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని మరువక ముందే మళ్లీ ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఈ నెల 21వ తేదీ నుంచి మరో తుపాను ఉంటుందని తెలియడంతో రైతులు దిగాలుపడిపోయారు. రెండురోజుల నుంచి దొరవారిసత్రం మండల పరిధిలో మేఘాలు కమ్ముకోవడంతో ఉద్యాన రైతులు ఆకాశం వైపు చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని, పంట నష్టానికి పరిహారంపై స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ మరో తుపాను గండం ఉంటే ఇటు పంట నష్టంతో పాటు ఆస్తినష్టం కూడా సంభవించే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాలలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



చిల్లకూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త : చిలకూరు మండల పరిధిలోని తుఫాన్ ముంపుకు గురైన కడివేడు, తిమ్మనగారిపాలెం, కలవకొండ, మోమిడి, వరగలి, వేళ్ళపాలెం, పల్లమాల గ్రామాలలో పర్యటించారు. గ్రామాల నందు తిరుగుతూ తుఫాన్ సంభవించినప్పుడు ఎదుర్కొన్న పరిస్థితులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తుఫాను వలన గ్రామాలలో దెబ్బతిన నిమ్మ, మిరప, అరటి, వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొన్ని గ్రామాలలో కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఇప్పటి వరకు అధికారులెవ్వరు రాలేదని గ్రామస్తులు చెప్పడం తెలుపుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పరచాలని అన్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, దొడ్ల నాగరాజు, మూగ శంకరయ్య, వెంకట కృష్ణయ్య, కృష్ణరెడ్డి, మునిశేఖర్ గౌడ్, దాసరి శైలజ, నేలటూరు సుప్రజ, చిరంజీవి, మైకెల్ కుమార్, ఎస్‌కె జాకీర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్పందనకు 28 సమస్యలు



చిత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమంకు జిల్లా నలు మూలల ప్రజల నుండి సమస్యలపై 28 సమస్యలు అందాయి. పోలీస్ స్పందన కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు తీసుకొన్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి సత్వరం సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రిశాంత్ రెడ్డితో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, ఎస్ఐబి అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిలు ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. పోలీస్ స్పందన కార్యక్రమంలో భూతగాదాలకు సంబంధించి 11, కుటుంబ తగాదాలు 6, ఆస్తి తగాదాలు 4, ఇంటి తగాదాలు 2, భర్త వేధింపులు 2, వేధింపులు 2, చీటింగ్‌కు సంబంధించి ఒక వినతిపత్రం పోలీసు అధికారులకు అందాయి.

## వనదుర్గాపురంలో సినిమా సందడి



పాలసముద్రం, డిసెంబర్ 11 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ అటవీ ప్రాంతంలో సినీ సందడి నెలకొంది. గత రెండు రోజులుగా వనదుర్గాపురం అటవీ ప్రాంతంలో గంగమ్మ ప్రొడక్షన్ బ్యానర్, ప్రొడక్షన్‌లో సింధూర పువ్వా చిత్రం షూటింగ్ జరుగుతంది. ఈ చిత్రంలో హిరో చంద్రశేఖర్, హిరోయిన్లు నిశ్చిత, మమతలపై డైరెక్టర్ ఆది, సోమవారాల్లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర డైరెక్టర్ దేవల్ల గోపి మాట్లాడుతూ గంగమ్మ ప్రొడక్షన్, బ్యానర్‌పై సింధూరపువ్వా చిత్రం నిర్మిస్తున్నామని, ఆకసక్తికర కథనంతో చిత్రం రూపొందిస్తున్నామన్నారు. వనదుర్గాపురం అటవీ ప్రాంతంలో రెండు రోజుల పాటు చిత్ర షూటింగ్ నిర్వహించామని, చిత్రంలో మరికొన్ని సన్నివేశాలు చిత్రీకరించాల్సి వుందని ఆయన పేర్కొన్నారు.

## మహిళా భక్తురాలి మృతి

చౌడేపల్లి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : తమిళనాడు రాష్ట్రంలోని మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి దర్శనానికి వెళుతూ మహిళా భక్తురాలు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారు జామున చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంకు చెందిన మాయాదేవి(39) 10రోజుల క్రితం ఓంశక్తి మాలను ధరించింది. ఈక్రమంలో మాలవిసర్జన కోసం పలువురి భక్తుల కలిసి సోమవారం తెల్లవారుజామున తమిళనాడు రాష్ట్రం మేల్‌మరవత్తూరుకు బస్సులో బయలుదేరింది. అయితే బస్సు ఎక్కిన వెంటనే మాయాదేవి ఉన్నట్టుండి కిందకు పడిపోయింది. గుర్తించిన సహభక్తులు పైకిలేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. దీంతో బత్తలాపురంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. రాత్రంతా అందరితో కలివిడిగా మాట్లాడి తెల్లవారుజామున మయాదేవి మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలికి ఇంటర్, టెన్త్ చదువుతున్న ఇద్దరు కుమార్తెలున్నారు. ఇప్పటికే తండ్రిలేకుండా ఉన్న పిల్లలు తల్లి మృతి చెందడంతో దిక్కులేనివారయ్యారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా మాయాదేవి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలుస్తోంది.

## అభివృద్ధి.. సంక్షేమ రథసారథి సిఎం జగన్

**- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**

కుప్పం, డిసెంబర్ 11 ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమ రథ సారథి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం కొత్తపేటలో ఆ ంధ్రాకు జగనే ఎందుకు కార్యక్రమంను మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కౌన్సిలర్ తిలగవతి అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నవరత్నాలు పథకాల్లో ఏదో ఓ రూపంలో లబ్ది పొందిందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకే తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక కొత్తపేట ప్రాంతంలో సుమారు 27కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కొత్తపేట అభివృద్ధికి తాము అన్నివిధాలా ముందుంటామన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగయ్య, గణపతి, నాగరాజు, నేతలు మంజు, మునస్వామి, దేవా తదితరులు పాల్గొన్నారు. అలాగే వానగుట్టపల్లిలో సైతం ఆంధ్రాకు జగనే ఎందుకు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఎంపిపి అశ్విని, కో ఆప్షన్ అత్తర్, ఎంపిటిసి బసవరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత, సర్దార్‌లు పాల్గొన్నారు.